# చీమలు పెట్టిన పుట్టలు

రంగు భార్యవంక అసహాయంగా చూశాడు.

అతని పరిస్థితి గమనించని అలువేలు గోరింటాకుతో పండిన తన చేతులను పరిశీలించుకుంటూ తనకు వివాహానికి పూర్వం తిరపతి, మద్రాసు ముఖ్యంగా సినిమా స్టూడియోలను చూడాలన్న కోర్కె యెంతగా ఉండేదో తన్మయత్వంతో చెప్పుకు పోతూంది.

"అవన్నీ తర్వాతగాని కీలుగుర్రం ఆఖరి రోజు. త్వరగా తయారయితే వెళ్ళొద్దాం" అన్నాడు. ఆ ఊళ్ళో అయితే డబ్బులు ఇవ్వకుండా సినిమా చూడవచ్చు. గేట్ కీపరు నుండి ఆపరేటర్ వరకు తండ్రి దగ్గరకు వచ్చే బాపతే. గల గల గాజుగంపలో రాయి విసిరినట్టు నవ్వింది అలువేలు.

"ఎందుకు? నేనేం హాస్యంగా మాట్లాడలేదే" అన్నాడు వుడుక్కుని.

"హాస్యం కాక ఏమిటండీ! మా అమ్మ మూడో తరగతి చదువుతుండగా వచ్చిందట కీలుగుర్రం. మా అమ్మకు సినిమాలంటే మా చెడ్డ భయమట. అమ్మమ్మను యెలా బోల్తా కొట్టి సినిమాకు వెళ్ళిందో ఓ మంచి కథలా చెబుతుంది అమ్మ. ఆ సినిమా నాక చూపిస్తారా?"

రంగు రోషం తెచ్చుకోబోయాడు కాని జంట చేపపిల్లల్లా అందంగా కదిలిన అలువేలు కళ్ళు అతనిపై సమ్మోహనాస్త్రాన్ని విసిరాయి.

"అలువేలూ...." ఆమె అధరామృతంలో స్వర్గమే కనిపించిందేమో. అతని మెడకు చేతులు వేసింది.

"ఏమండీ.........మనము.... .... మద్రాసు వెడదాం...." ముద్దుగా గునిసింది.

"తప్పక వెడదాం...." ప్రమాణం చెయ్యలేదుగాని వాగ్దానం చేశాడు. అలువేలు పరవశించిపోయింది. భర్తంటే భక్తి, ప్రేమ కలిగాయి.

"రంగూ!" బయటినుండి రత్తయ్య గొంతు కర్కశంగా వినిపించింది. రంగు మైకం వదిలిపోయింది. తండ్రి యెందుకలా పిలిచాడో అర్థం అయింది. అతను భార్యతో కబుర్లు చెప్పినందుకు కాదని తెలుసు. రెండు రోజులక్రితం ప్రక్కఊరి రైతు పదిరూపాయలిచ్చి తండ్రికిమ్మన్నాడు. అలువేలు మల్లెపూలు తెమ్మన్నది. ప్రారంభంలోనే సంసార జీవితాన్ని కలతలపాలు చెయ్యటం ఇష్టంలేక ఒక్క రూపాయి తీసుకుని తొమ్మిది రూపాయలు ఇచ్చాడు. సాధారణంగా రత్తయ్య మందు ఫీజు పది రూపాయలు. అప్పుడప్పుడు కొందరు బేరమాడే స్వభావం గలవారు తొమ్మిది, ఎనిమిది ఇస్తుంటారు. వారి స్వభావానికి నవ్వి ఊరుకుంటాడు.

"ఏమీటి నాన్నా?" భయంగా బయటికి వచ్చాడు.

"నిన్న రామయ్య ఇచ్చిన డబ్బులో రూపాయి కాజేసి ఏం చేశావు?"

"అది కాదు నాన్నా...."

"ఏది కాదు. డబ్బిలా విచ్చలవిడిగా ఖర్చు పెడితే నువ్వు వెందుకు పనికివస్తావురా? గాడిదలను కాద్దువులే."

"పోనియ్యి బావా! కొత్తగా పెళ్ళయిన కుర్రవాడు కదా రూపాయి ఖర్చు వుండదా!" అప్పుడే అక్కడికి వచ్చిన ప్రక్కింటి చెట్టి రాజీ కుదర్చాలని చూచాడు.

"ఓయ్!...ఏం చెట్టీ, ఎలా వుంది వ్యవహారం! ఈ భూమండలమ్మీద రోజుకు ఎన్నో పెళ్ళిళ్ళు అవుతున్నాయి. కొత్త, పాత ఏంటయ్యా...ఆ! సంసారమన్నాక చూచి ఖర్చుపెట్టుకోవూ! అడ్డగాడిదలా ఒడ్డుపొడువు పెరిగావు...." తిట్లప్రవాహానికి అడ్డువేస్తూ చెట్టి అతడిని బయటికి లాక్కుపోయాడు.

"ఎంత కొడుకయినా అలా తిట్టటమేనా! కోడలుపిల్లకు లోకువ కాడు? వాడు కావాలన్నాడా! తొందరపడి పెళ్ళి చేశావు. ఏవో ఖర్చులుంటాయి."

రత్తయ్య ఏమి అనలేక, వెళ్ళి తన పీట మీద కూర్చున్నాడు.

"చెట్టీ! పెళ్ళి నాకు అరక్కుంటే చేశాను అనుకుంటున్నావేమో, ఎప్పుడూ ఆ చిన్ని పంతులు బిడ్డతో పరిహాసాలు ఆడుతుంటే, జాతి సంకరమవుతుందని చేశాను" రత్తయ్య మాటలకు అడ్డువేస్తూ ఓ నల్గురు పొరుగూరివారు వచ్చారు.

"రత్తయ్యా! ఒల్లంతా ఒక్కటే నొప్పులయ్యా. పిండికొట్టినట్టుంది. ఏభై రూపాయలు ఖర్చుపెట్టి ఇంగ్లీషుమందులే వాడాను." ఒకతను హూస్సురంటూ కూర్చున్నాడు.

"ఏందోనయ్యా ఈ తేప నీ మందు పని జెయ్యలే. వాతంపెయ్యి." మరొకతను నిట్టూర్చాడు.

"రత్తయ్యా! నీ మందు వాడాక మా వియ్యపురాలి కాళ్ళు బొంగరాల్లా తిరుగుతున్నాయంట. ఆమె ఆడబడుచుకు, ఆడబడుచు వియ్యపురాలికి మందు కావాల్నట." మరొకతను ఉత్సాహంగా చెప్పాడు. అందరూ చెప్పినవి విని నిదానంగా నవ్వాడు. రత్తయ్య ఇంట్లో వాళ్ళదగ్గర పులి అయితే బయటివారి దగ్గర పిల్లే అవుతాడు.

అసలు సంగతి ఏమిటంటే రత్తయ్య మందులిస్తాడు. ఒకటే రోగానికి అని నియమము లేదు. ఆయన మందు సర్వరోగ నివారిణి. వాతము, పైత్యము, కీళ్ళవాతము ఒకటేమిటి అన్నిరకాల రోగాలు నయమవుతాయని వినికిడి. ఏ డాక్టరు దగ్గర కుదరని మొండిరోగాలుంటే 'రత్తయ్య మందు తిందాము అనుకుంటున్నాము' అంటారు జనము. ఆ రత్తయ్య మందు వివరాలు ఎవరికీ తెలియవు. పది రోజుల మందుకు పది రూపాయలు తీసుకుంటాడు. రోజుకు పదిమంది మండి పాతికమంది వస్తారు. ఒకసారి ఒక డాక్టరమ్మ అత్తగారికి 'రత్తయ్య మందు'తో కడుపునొప్పి తగ్గింది. ఆ అత్త కోడలి చదువును అవహేళన చేసిందట. ఆ కోడలు డాక్టరమ్మ పనిగట్టుకుని రత్తయ్య ఇంటికి వచ్చి మందు వివరాలు అడిగింది.

"ఏదో డాక్టరమ్మా. నాదేం లేదు. అంతా ఆ స్వామి దయ. అతని పేరుతో తులసి

మాదిరెడ్డి సులోచన

దళాలు ఇస్తున్నాను" అన్నాడే తప్ప వివరాలు చెప్పలేదు. ఆమె ఆ మందు విషయములో రిసర్చిచేసి, ఆ ఫార్ములా వైద్యసహాయ సమితికి అందజేసి మంచి బహుమతి ఇప్పిస్తానని కూడా చెప్పింది. అతను 'స్వామి దయ' అనటం తప్ప రెండో మాట అనలేదు. ఆ కుర్ర డాక్టరమ్మ, ఫ్రెండు వాదించుకుంటూ వెళ్ళిపోయారు.

"ఇదంతా ఫాల్స్ బిలీఫ్. తను ప్రజలను మోసం చేస్తున్నాడు" డాక్టరమ్మ అరుపు.

"మోసం ఎల్లకాలం సాగుతుందంటావా?" ఫ్రెండు ప్రశ్న. డాక్టరమ్మ ఆలోచించింది.

"ఆర్. కె. నారాయణ్ "ఆస్ట్రాలజర్స్ డే" చదువలేదూ. అతను అవసరానికి వేసిన వేషం యెంత బాగా కుదిరింది?"

"కొంత సైకలాజికల్ సాటిస్ఫాక్షన్ ఉంటుందనుకో. ఈ అశాస్త్రీయ విషయాలు ఇంత ప్రగతి సాధిస్తున్నాయంటే, మన దేశంలో సైంటిఫిక్ థింకింగ్‌లో, ఐ మీన్ చదువులో నిజాయితీ లేదన్నట్టే కదా...." డాక్టరమ్మ ఆలోచనలో పడింది. ఇలా రత్తయ్య మందు గురించి ప్రయత్నించి చాలా మంది విఫలురయ్యారు.

రత్తయ్య ఉదయం లేస్తూనే అటు అడవికి వెళ్ళి ఏవేవో ఆకులు, చెక్కలు తెచ్చుకుని, తనే ఏవో తయారు చేసేవాడు. అతని భార్య పున్నమ్మకు కూడా తెలియదు. ఆమె తెలుసుకోవాలని ప్రయత్నించనూలేదు. ఆమెకు తెలిసిందల్లా భర్తకు, కొడుక్కు వండి పెట్టుకుని, ఇల్లును శుభ్రం పెట్టుకుని ఉండటమే. రత్తయ్యే దీపావళికి ఒక చీర, సంవత్సరాదికి ఒక చీర కొనిస్తాడు ఆమెకు అక్కడికే సంతోషము. సంవత్సరానికో సారి పుట్టింటికి వెడితే ఆమె పల్లురన్న తమ్ముళ్ళు తలా ఒక రెవికెల గుడ్డ పెడతారు. రెండు చీరలు నాల్గు రవికెలు చాలు. పెళ్ళి నాడు ఆమె తండ్రి పెట్టిన దిద్దులు దండె కడియము, మెడలో గుండ్ల పేరున్నాయి. అవి పెట్టుకుని, ముచ్చట ముడి వేసుకుని, ఏ కాలం వచ్చే పువ్వులు ఆ కాలములో తల నిండుగా పెట్టుకుని, అందరిచేత లక్ష్మీదేవి అనిపించుకుంది. 'చాదస్తం కాకపోతే తంగేడు పువ్వులు తలలో పెట్టుకుంటారా' అని నవ్విన వారున్నారు.

కొడుక్కు రంగనాధస్వామి పేరు పెట్టుకుని 'రంగు' అంటూ పిలుచుకుంటారు. అతనిక్కి నిక్కర్లు వేసుకోవటం కుదరదని బడిలో పంతుళ్ళు అంటే, రత్తయ్య సంవత్సరానికి సైను గుడ్డతో రెండు పైజామాలు, లాల్చీలు కుట్టించేవాడతను. ఒక్క జత పంచెలు, లాల్చీలు కుట్టించేవాడతను. ఒక్క జత పంచెలు, పై పంచెతోనే కాలం నెట్టుకు వస్తున్నాడు. భోజనము దగ్గర కూడా చాలా క్లుప్తంగా అన్నము, ఒక కూర, లేదా పప్పు తప్ప మరో అదరువు వద్దనేవాడు. ఎందుకు వద్దు అని యెవరూ అడగలేదు.

పద్దెనిమిదేళ్ళు వచ్చిన రంగు మిషన్ కాంపౌండులో చదువుతూ చిన్ని పంతులు కూతురితో సినిమాకెళ్ళటం చూచిన రత్తయ్య వెంటనే రంగు చదువు చాలంటూ, పున్నమ్మ తమ్ముడి కూతురు అలువేలును రంగుకు ముడి పెట్టాడు.

"ఆ ఇంట్లో నా పిల్లకు ఓ అచ్చటా, ముచ్చటా జరుగుతాయా!" అలువేలు తల్లి అయిష్టత ప్రకటించింది.

"మనమ్మాయి అన్నీ చక్కదిద్దుతుందే. కాని కట్నం లేకుండా లక్షాధికారికి ఏకయిక వారసుడు దొరకటం మాటలా!" అలువేలు తండ్రి సంతోషించాడు. తన తండ్రి దగ్గర లక్షరూపాయలున్నాయా! రంగుకు ఆశ్చర్యం కలిగేది. ఏమీలేని పంతులుగారు భార్య నగలమ్మి కూతుర్ని చదివిస్తుంటే తన తండ్రి యెందుకు ముందుకు రాడు! అంతా అబద్ధం అనుకునేవాడు. అంతకంటే ముందుకు వెళ్ళి ఆలోచించే అవసరము అతనికి కలుగలేదు.


అలువేలు వచ్చాక అవసరాలు పెరిగాయి. పౌడరు కావాలంటుంది, చీరలంటుంది, పువ్వులంటుంది. దేశంమీద తిరుగుదామంటుంది.

"మీరు పేంటు చొక్కా వేసుకుంటే అచ్చు సినిమా యాక్టర్లా వుంటారు" అని ఊరించేది. పండక్కి మామగారు కుట్టించిన ప్యాంటు, చొక్కా వేసుకుని, అద్దం ముందు నిలబడి తనేనా అని చూచుకున్నాడు. బట్టలు కూడా మనిషి అందాన్ని ఇనుమడింపజేస్తాయని అర్థం అయింది మొదటిసారి. అతనికి రంగుల కలలు వస్తున్నాయి. నేను సంపాదించాలి. అప్పుడే కలలు నెరవేరుతా యన్న విజ్ఞత రాలేదు. చిన్నవయసాయె మరి. కోరికలవలలో చిక్కుకుని భార్య యెత్తిపొడుపులతో గిలగిల లాడిపోతున్నాడు. ఏదయినా పని చేద్దామన్నా తోచటంలేదు. పనివున్నా అతని ఆలోచనలు అంత తీవ్రంగా ఉండేవి కావేమో.

"మనము తిరుపతి, మద్రాసు పోనట్టేనా!" భార్య అలక సాగించింది.

ధైర్యంచేసి తమ ప్రయాణం సంగతి తండ్రితో చెప్పాడు రంగు.

"దేవుడు ఇక్కడ లేడా! ఇక్కడినుండే నమస్కారం పెట్టి చెంపలు వాయించుకో" అన్నాడు రత్తయ్య. భార్యతో అదే మాట



చెప్పి, తన అసహాయతను వెళ్ళడించాడు.

"నాన్న దగ్గర డబ్బు లేదేమో అలు వేలూ...."

"బోలెడుందని మా నాన్న చెప్పాడు."

"ఎక్కడుందంటావు! బ్యాంకులో వేస్తాడా? అంటే మా నాన్న అటు వెళ్ళగ యెన్నడూ చూడలేదు."

"చెట్టి! ఓ రెండు రూపాయలు బదులు ఇవ్వవోయి." రత్తయ్య అడగటం విని అప్పటికి ఊరుకున్నారు. అలువేలు బుర్ర చురుకయింది. రోజుకు వంద వస్తే పది కూడా ఖర్చుకావు. రత్తయ్య భార్యకు కొడుక్కు ఆ మాత్రమయినా ఖర్చు పెడతాడు గాని తనకంటే అసలు పెట్టుకోడు. మధ్యాహ్నము చట్టిలో కూర తక్కువ కనిపిస్తే, సాయంత్రము మళ్ళీ యెక్కడ వండుతుందో నని మజ్జిగ పోస్కుని లేచేవాడు. రెండుసార్లు అన్నం తినడం తప్ప మరే అలవాటు లేదు.

రంగుకు తన తోటి వారిని చూచినప్పుడల్లా తండ్రిని చంపేద్దామన్నంత కోపం వచ్చేది. హాయిగా చదువుకుంటూ, చక్కని వేష, భూషణాలలో వున్నారు. రోషం వచ్చి పనిచేద్దామన్నా, ఇచ్చేవారు కనిపించలేదు. తండ్రి పిపినిగొట్టు తనము, భార్య యెత్తిపొడుపులు అతడిని పిచ్చివాడిని చేస్తున్నాయి. దొంగతనమయినా చేసి భార్య కోర్కె తీర్చాలన్నంత ఆవేశం కలిగింది. ఆ ఇంట్లో అమ్మటానికి కూడా వస్తువు కనిపించలేదు.

"నాన్నా! మీ కోడలికి.... పండుగకు చీర కావాలంటు ...."

"పెళ్ళి అయి పదేళ్ళు అయినట్టు పండుగకు మనము చీరలు కొనాలా! కొనేరోజు కొందాములే." మరో మాటకు అవకాశము ఇచ్చేవాడు కాదు.

"పండగయినా మనింట్లో పిండి వంటలు లేవా!" అలువేలు అత్తను అడిగింది. జవాబు మామ ఇచ్చాడు.

"పిండి వంటలు, దండివంటలు తిని డాక్టరు దగ్గరకు వెళ్లాలనా? ఇదే తిండి పాతికేళ్ళుగా తింటున్నాము. మీ అత్తగాని, నేనుగాని చీడ యెరగం...."

అలువేలు అసహాయంగా చూచింది. ఆ రాత్రి అలక సాగించింది. ఆకలి నక, నకలాడుతుంటే నిదుర దూరమయింది. అటుదొర్లి, ఇటు దొర్లి మొద్దులా నిదురబోతున్న భర్తను చూచి విసుక్కుంది. మంచినీళ్ళకని బయటికి వచ్చి, మామ గదిలో దీపం వెలుగుతుంటే ఆశ్చర్యంగా చూచింది. దీపాల ఖర్చుని ప్రొద్దుండగానే అందరిని తినుమని కేకలు వేస్తాడు. మరిచి పోయి దీపం ఉంచాడా అని కిటికీలోనుండి తొంగిచూచింది. ఆమె గుండె ఆగినంత పని అయింది. గబ గబ లోపలికి వచ్చి భర్తను లేపింది. రెండు గదుల వసారాతో ఇల్లుంది. చుట్టూ ప్రహరి గోడ. ఒక పక్క తనకయి గది వేసుకున్నాడు. రెండో వైపు వంటిల్లు వేశాడు. ఆ రెంటిటిని కలిపిన గోడకు బయటి తలుపుంటుంది.

"ఏమిటి?"

"ఉష్! నా వెంటరండి."

ఇద్దరూ పిల్లుల్లా వచ్చారు. కిటికీలో వున్న రంధ్రం ద్వారా లోపలి దృశ్యము చూపింది. మంచం ప్రక్కకు జరుపబడివుంది. అక్కడో చతురస్రాకారపు నేలమాళిగ లాంటిది వున్నది. దాన్నిండా నోట్లే. తనముందున్న రూపాయల కుప్పలోనుండి అయిదులు,పదులు ఒక్కరూపాయి వేరుచేసి కట్టలుకడుతున్నాడు. అతను కదలటంతో ఇద్దరు వెనక్కువచ్చారు.

"చూచారా! ఇప్పుడయినా మా నాన్న అబద్ధం చెప్పరని అంగీకరిస్తారా!"

రంగుకు మతిపోయినట్టుగా ఉంది. అంత డబ్బుండగా తండ్రి యెందుకు నికృష్టంగా గడుపుతున్నట్టు. ఒక్కనాడయినా తీరయిన


# SREE VENKATESWARA MINERALS (P) LTD.,

*Registered Office* :

No. 337, Thambu Chetty Street, MADRAS-600 001

*Factory* :

No. 3, Elaya Mudali Street, TONDIARPET, MADRAS-600 081

*Manufacturers of* :

Insecticides and Pesticides Formulations and Suppliers of Mineral Powders

Telephone Nos : Office : 24909
Factory : 551818

తిండి తినలేదు. ఇంపయిన బట్టకట్టలేదు. యెన్నిమైళ్ళయినా నడిచే వెళ్ళాడు. డబ్బు వుండి యెందుకుని.

"మాట్లాడరేమండీ...." అలువేలు కుదిపింది.

"ఆఁ ...ఏమన్నావ్?"

"ఇదిగో ఇప్పుడే చెబుతున్నాను. అంత డబ్బు ఉండి యెందుకు? రేపే పెళ్ళి అడగండి" అలువేలులోని విరాళ ఆశగా వారి ఒక్కసారి వెలిగిపోయింది. ఆమె ప్రణాళికలు ఆమె వేసుకుంది.

మర్నాడు భార్య చెప్పిన మాటలు మననము చేసుకుంటూ తండ్రి దగ్గరకి వచ్చాడు. మందులు దంపే కలపురాయి చేతిమీద పడి వాచిందని కట్టు కట్టించుకుంటున్నాడు మంగలాడిచేత.

"నా మాటినుండ్రయ్యా. ఆసుపత్రికి బొండి. బొమికె ఇరిగింది. లేకుంటే ఇంత వాపు చూపదు..." మంగలి సలహా ఇచ్చాడు.

"యెందుకురా డబ్బు దండుగ. సాయంకాలమెల్లి ఆకులు తెచ్చి కట్టుకుంటాను. మనకేం గవర్నమెంటు ఉద్యోగమా, వ్యాపారమా?" రత్తయ్య తేల్చి వేశాడు. ప్రాణం మీదికి వచ్చినా తన కోసం డబ్బు ఖర్చు పెట్టుకోని తండ్రిని, తనకోసం యెలా అడుగుతాడు. ఆ రోజు రత్తయ్య చెయ్యివాపు చూసి అలువేలు ఏమీ అనలేకపోయింది. చెయ్యివాపుతో జ్వరమువచ్చి వారము రోజులు పడక వేసినా, కష్టంతో కప్పెడు పాలు త్రాగలేదు. నాల్గు అణాలు పెట్టి ఒక మాత్ర కొనలేదు, అది చూచిన రంగు మతిపోయింది. తండ్రిచేత ఖర్చు పెట్టించటం బ్రహ్మతరము కాదని తెలిసిపోయింది. "చూడు అలువేలూ! ఇది నా సంపాదన కాదు. అడిగే హక్కులేదు. ఏదో ఓ పని చేసి నిన్ను తీసుకు వెడతాను." అన్నాడు రంగు.

"అప్పటి వరకు నేను ముసలిదాన్ని అయిపోతాను." వెక్కి వెక్కి ఏడ్చింది ఆ తరువాత అలువేలుకు పిచ్చిపట్టినట్టుంది. మామగారి మంచము క్రింద దాచిన రూపాయలు ఆమె కళ్ళ ముందు, గిరా, గిరా తిరుగ సాగాయి. ఆ గదిలోకి వెళ్ళాలని యెన్నోసార్లు ప్రయత్నించి విఫలురాలయింది. అతను బయటికి వెళ్ళేటప్పుడు తాళం వేసుకు వెడతాడు. తాళం తీద్దామని రంగుతో సంప్రదించింది.




అతను సుతరాము అంగీకరించలేదు.

అలువేలు పుట్టింటికి వచ్చి తండ్రితో విషయము చెప్పింది. అతను ఆలోచించాడు. తన అంతరంగికులనుకునే వారిని సంప్రదించాడు. చివరకు ఉపాయము ఆలోచించాడు. కూతురితో విషయము చెప్పాడు.

"నాన్నా! అన్యాయంగా అంత డబ్బు ప్రభుత్వానికిచ్చి, వాళ్ళిచ్చినంత దానంగా తీసుకోవాలా?" లౌక్యం తెలియని అలువేలు అడిగింది. అతను నవ్వాడు.

"అంతో, ఇంతో వస్తుంది మీకు. ఆ ముసలాడు ఇప్పుడప్పుడే చస్తాడా? ఇక రెండో దారి అతడిని అంతం చేయటమే." అలుమేలు తండ్రి అడిగాడు. ఆమె వణికి పోయింది.

"వద్దు నాన్నా! ఏమాటకామాటే చెప్పుకోవాలి. మంచివాడు" అన్నది. అతను కూతుర్ని ప్రేమగా అక్కున చేర్చుకున్నాడు.

రత్తయ్య మామూలుగా వచ్చినవారికి మందులిచ్చి విశ్రమించాలని లేచాడు. ఎదురుగా నిల్చున్న ప్రభుత్వ అధికారులను చూచి ఆగిపోయాడు.

"రత్తయ్య అంటే?"

"నేనేనండి. నా మందు మీ దాక వచ్చిందా...." నవ్వాడు.

"మందు మీ రాబడి, ఖర్చు లెక్కలు చూపండి" ఒకతను అడిగాడు.

"రాబడి....లెక్కలా? యెందుకు, నా కష్టం ఖర్చు పెట్టుకుంటాం, మిగుల్చుకుంటాం మీకుందుకు? నేను యెవరిదగ్గరా దోపిడి చెయ్యలేదు" రత్తయ్య రోషంగా అన్నాడు. వాదోపవాదాలు పెరిగాయి. వారు సోదా మొదలుపెట్టి రత్తయ్య దాచిన చోటు కనుక్కున్నారు. ఒక్కరూపాయి నోట్లు లెక్కించటానికి ఒక్కరోజు పట్టింది. రెండు లక్షల చిల్లర డబ్బులు లెక్కించారు. రత్తయ్య రాయిలా అయ్యాడు. ఏ ఫిలాసఫర్ కూడా కష్టార్జితాన్ని వదులుకొమ్మని చెప్పలేదు. కాని రెండవ ప్రాణంగా దాచుకున్న డబ్బు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కొంత శాతం కొడుక్కు ఇస్తామని చెబుతుంటే అతను అందరివంక పిచ్చి చూపులు చూచాడు. రంగు భార్యను ఉరిమి చూచి, తండ్రికి ముఖం చూపించలేక బయటికి వచ్చాడు. చెట్టి కొడుకు గాబోలు గట్టిగా చదువుతున్నాడు.

చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరువయిన యట్లు....

.... .... .... ....

రంగు కనుకొలుకులలో నిండిన నీరు ఒత్తుకుని, తండ్రిని తలుచుకుని జాలిగా నవ్వుకొన్నాడు.